జోరుగా పందేలు

- చింతమనేని ఒక్క ఓటుతోనైనా గెలుస్తారంటూ రూ.లక్షకు రెండు లక్షల పందేలు

దెందులూరు, మే 23 : ఎన్నికల ఫలితల తేదీ దగ్గర పడే కొద్ది దెందులూరు రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి తరపున టీడీపీ ఫైర్ బ్రాండ్‌గా పేరు పొందిన చింతమనేని ప్రభాకర్, వైసీపీ తరపున కొఠారు అబ్బయ్య చౌదరి ఎన్నికల్లో పోటీ చేశారు. ఇప్పుడు వీరి గెలుపుపై పందేలు జోరందుకున్నాయి. కూటమి సక్సెస్ అయిందని, జనసేన, బీజేపీ చింతమనేని గెలుపునకు పూర్తి స్థాయిలో సహకారం అందించాయని విజయం తథ్యమంటూ హెచ్చు పందేలు కాస్తుండగా వైసీపీ తరపున రెట్టింపు పందేలు కాసేందుకు అంతగా ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మండలంలోని ఒక మెట్ట గ్రామంలో టీడీపీకి చెందిన ఒక రైతు చింతమనేని ఒక్క ఓటుతోనైనా గెలుస్తారని రూ.లక్షకు రూ.రెండు లక్షలు పందెం కాశాడు. కొవ్వలి, పోతునూరు, శ్రీరామవరం, పెరుగుగూడెం, రామారావు గూడెం, కంద్రిగ నరసింహపురం తదితర గ్రామాల్లో చింతమనేని ఐదు వేల మెజార్టీతో గెలుస్తారని టీడీపీ అభిమానులు రూ.లక్షా 50 వేలు, వైసీపీ తరపున రూ.లక్ష చొప్పున పదుల సంఖ్యలో పందేలకు దిగారు. దెందులూరు, పెదవేగి మండలాల్లో టీడీపీకి మెజార్టీ వస్తుందని, పెదపాడు, ఏలూరు రూరల్‌లో వైసీపీకి మెజార్టీ ఓట్లు వస్తాయని పందేలకు దిగుతున్నారు. కొవ్వలిలో టీడీపీకి 300 ఓట్లు అధిక్యం వస్తుందని పందేలు కాశారు. పెరుగుగూడెం, గంగన్నగూడెం, జోగన్న పాలెం, గాలాయగూడెం, కొవ్వలి, దెందులూరు ఈ ఆరు గ్రామాల్లో టీడీపీకే అధిక్యం వస్తుందని పందేలకు దిగారు. కొఠారు అబ్బయ్యచౌదరి తన సొంత గ్రామాలుగా భావించే కొండరాయుడు పాలెం, రాయుడుపాలెం విజయరాయి, రాట్నాల కుంటల్లో సైతం 55 శాతం టీడీపీకే అనుకూలంగా ఓటింగ్ పడిదంటూ కొంత మంది, 50 - 50 ఓట్లు వస్తాయని, టీడీపీకి ఒక్క ఓటు కూడా ఎక్కువ రాదని మరికొందరు పందేలు కాశారు. చింతమనేని సొంత గ్రామమైన దుగ్గిరాలలో 60 శాతం వైసీపీకి ఓట్లు పడ్డాయని కొంతమంది పందేలు కాయడం గమనార్హం.

ఫత్తేపురం..పందేలకు మజా !



నిడమర్రు, మే 23: జిల్లాలో ఫత్తేపురం రాజకీయ పందేలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. పందేలు వేయడంలో ఫత్తేపురం గ్రామస్థులది అందవేసిన చెయ్యి. జిల్లావ్యాప్తంగా , రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల పందేలలో భాగంగా సీటు గెలుస్తుందని, మెజారిటీ వస్తుందని, మా పార్టీ ప్రభుత్వం ఏర్పతుందని పందేలు జరుగుతుంటే ఫత్తేపురంలో మాత్రం విభిన్నంగా పందేలు జరుగుతుం టాయి. ఈ ఎన్నికలలో ఫత్తేపురానికి చెందిన పత్సమట్ల ధర్మరాజు జనసేన పార్టీ తరుపున కూటమి అభ్యర్థిగా ఉంగుటూరు అసెంబ్లీ స్థానానికి పోటీపడడంతో పందేలు మరింత జోరుగా సాగుతున్నాయి. వైసీపీ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావుది కూడా ఇదే మండలం బువ్వనపల్లి కావడంతో పందేల జోరు పెరిగింది. ప్రస్తుతం ఉంగుటూరు నియోజకవర్గం వ్యాప్తంగా కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు గెలుపుపై 60 వేలు : 40 వేలు చొప్పున పందేలు జరిగాయి. ధర్మరాజుకు 30 వేల మెజారిటీ వస్తుందని అంత మెజారిటీ రాదని ప్రత్యర్థులు పందేలు వేస్తున్నారు. మరో వైపు ఓటింగ్ నమోదు సరళి ఆధారంగా గ్రామంలో కొత్త పందేలు తెరలేచాయి. ఫత్తేపురంలో 3,009 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. గ్రామ ఫలితాల్లో వైసీపీకి, జనసేన అభ్యర్థులకు ఎవరికి ఎక్కువ మెజారిటీ వస్తే ఆ మెజారిటీ ప్రకారం ఒక్కో ఓటుకు 10 వేలు అవతల వారికి చెల్లించేలా ఒప్పందాలు జరిగాయని సమాచారం. ఈ లెక్కన గ్రామంలో ఎవరికైనా 500 మెజారిటీ వస్తే పందెం ప్రకారం 50 లక్షలు చెల్లించాలి. అదే 1000 ఓట్లు మెజారిటీ వస్తే కోటి రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. ఇదీ ఫత్తేపురం పందేల మజా. అందుకే పందేలకు రారాజు ఫత్తేపురం అని ఈ ప్రాంతవాసులు అంటుంటారు.

టెన్షన్‌కు.. విశ్రాంతి!


భీమవరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అంజిబాబును కలసిన 20వ వార్డు టీడీపీ నాయకులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

- టిక్కెట్ కోసం మూడు నెలల టెన్షన్..
- ఆపై మరో 50 రోజులు జనం మధ్య..
- శత్రుపక్షం ఎత్తులకు పైఎత్తులు..
- జనాలను మెప్పించేందుకు భారీ హామీలు..
- ఊళ్ళకు ఊళ్ళు తన వైపు తిరిగేలా ఆకర్ష్ మంత్రం..
- పోలింగ్ సమయం దగ్గరపడే కొద్దీ పంపకాల్లో బిజీబిజీ..

ఎన్నికల నియమావళి తూచా తప్పనట్టు వ్యవహరిస్తూనే తమ పని చక్కబెట్టేందుకు రోజు ఒక క్షణంగా గడిచిపోయింది. ఓటర్ దేవుళ్ళు తమ తీర్పును బ్యాలెట్‌లో భద్రం చేశారు. ఆ తర్వాత కూడా ఎక్కడెక్కడ తనకెన్ని, మిగతా వారికెన్ని ఓట్లు లభించాయో లెక్కల తక్కెడ. నెలల తరబడి క్షణం తీరిక లేకుండా పోయిన అభ్యర్థులంతా ఇప్పుడు ఆచ్ వెళ్ళారు. మరికొందరు స్వగ్రామాల్లోనే ఇంకా లెక్క కడుతూనే ఉన్నారు.

ఎవరి తిప్పలు వారివే

ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా జరిగాయి. ఓటర్ల దగ్గర నుంచి అభ్యర్థుల వరకు ఎవరు క్షణం తీరిక లేకుండా మునిగితేలారు. ప్రచార సంబరాల్లో జై కొట్టేవాళ్ళు కొందరైతే వ్యతిరేకించేవారు ఇంకొందరు, సామాజిక వర్గాల వారీగా ఓటర్లలో చీలిక. పార్టీల వారీగా అంతకంటే మించి. గెలుపే లక్ష్యంగా ఆసాంతం మడమ తిప్పకుండా అభ్యర్థులంతా పరుగులు తీస్తూనే వచ్చారు. ఎన్నికల రేస్‌లో ఎక్కడ వెనుక పడ్డామో, మరెక్కడ ముందడుగు వేస్తున్నామో అంచనాలు వేసుకుంటూ సరైనబాటలో పయనించేందుకు ప్రయత్నిస్తూనే, అందర్నీ సంతృప్తిపరుస్తూ విమర్శలు, ఆరోపణలు తిప్పికొడుతూ ఇలా సాగిన ఎన్నికల ప్రయాణంలో అభ్యర్థులంతా అలసి సొలసారు. మండుటెండను ఖాతరు చేయకుండా గడపగడపకు తిరిగి కాళ్ళు బొబ్బలెక్కినా ఖాతరు చేయని అభ్యర్థులు ఎందరో. ప్రత్యేకించి గోదావరి జిల్లాల్లో ఓటర్లను మెప్పించడం అంత సులభమేమీ కాదు. ఏలూరు,

రిలీఫ్ కోసం.. విహార యాత్రలకు ఎమ్మెల్యే అభ్యర్థులు

- కొందరు నేపాల్, శ్రీలంకకు.. మరికొందరు హైదరాబాద్‌కు
- ఇంకొందరు స్థానికంగా అందుబాటులో..

నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలో అభ్యర్థులంతా తమంతట తాముగా కొన్ని లక్ష్యాలు పెట్టుకుని, పార్టీ లక్ష్యాలను దీనికి జోడించి మరీ చెమటలు కక్కారు. ప్రధాన పక్షాలు, కూటమి, వైసీపీ అభ్యర్థులైతే నెలల తరబడి కంటిమీద కునుకు లేకుండా వ్యూహాలు రచించి, అమలు చేశారు కూడా. ఈసారి ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే అభ్యర్థుల సంఖ్య భారీగానే ఉంది. గతం కంటే మించి నువ్వా నేనా అన్నట్లు పోటీ సాగింది. క్యాంప్ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలు, నివాసాలన్నీ ఇన్నాళ్ళు పార్టీ అభిమానులు, కార్యకర్తలతో కిక్కిరిసి కనిపించాయి. పోలింగ్ పూర్తి అయిన వారం తర్వాత కూడా దాదాపు ఇదే పరిస్థితి. ఇప్పుడిప్పుడే అభ్యర్థులంతా కాస్త సేద తీరేందుకు కుటుంబ సభ్యులతో కలిసి కాస్త పక్కకు జరిగారు. కొందరు స్వగ్రామాల్లోనే వేచి ఉండి, ఇంకా లెక్కల్లోనే మునిగి తేలుతున్నారు.

ఎవరెవరు... ఎక్కడెక్కడంటే?

ఎన్నికల రేసులో ఇప్పటి వరకు అలసిసొలసిన అభ్యర్థులంతా ఇప్పుడు కాస్త రిలీఫ్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు ఇంకా గడువు మిగిలి ఉండడంతో కుటుంబ సభ్యులతో కలిసి సుదూర ప్రాంతాలకు వెళ్ళారు. మరికొందరు కేసులకు భయపడి అజ్ఞాతంలో ఉన్నారు. నరసాపురం అసెంబ్లీ స్థానంలో కూటమి అభ్యర్థి బొమ్మిడి నాయకర్ కుటుంబ సభ్యులతో కలిసి హిందూ దేశమైన నేపాల్‌కు వెళ్ళారు. బూటాన్‌లో కొద్ది రోజులు ఉండి సేద తీరాలని ఆయన భావిస్తున్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా తనకు సమాచారం అందించాలని సూచిస్తూ ఆయన నేపాల్ యాత్రకు వెళ్ళారు. దెందులూరు వైసీపీ అభ్యర్థి అబ్బయ్యచౌదరి యథావిధిగానే లండన్‌లో ఉన్నారు. ఆయన గడిచిన కొన్నాళ్ళుగా లండన్ కేంద్రంగా పనిచేస్తున్నారు. ఎన్నికల సమయంలోనూ, పార్టీ కార్యక్రమాలు అమల్లోనూ అప్పుడప్పుడు నియోజకవర్గానికి వచ్చి వెళ్లడం అలవాటు. ఎలాగో పోలింగ్ ముగిసింది కాబట్టి నేరుగానే లండన్‌కు చేరారు. కౌంటింగ్ సమయానికి సొంత ప్రాంతానికి చేరుకుంటారు. కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అనూహ్యంగా ఒక కేసులో నిందితుడిగా పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆయన చానాళ్ళగా సొంత ప్రాంతాన్ని వదిలి వేరే ప్రాంతంలో అజ్ఞాతంలోకి వెళ్లారు. ఉంగుటూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు తన వ్యాపార లావాదేవీల నిమిత్తం అస్సోం రాష్ట్రంలో బస చేశారు. భీమవరం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు, వైసీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ భీమవరంలోనే పార్టీ కేడర్‌కు అందుబాటులో ఉన్నారు. వీరిద్దరు జరిగిన ఎన్నికల్లో ముఖాముఖి పోటీ పడ్డారు. మిగతా అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికి వీరి మధ్యే ప్రతిష్ఠాత్మకంగా ఎన్నిక సాగింది. అయినప్పటికి కనీసం సేద తీరేందుకు భీమవరం విడిచి వీరిద్దరూ ఎక్కడికి వెళ్ళలేదు. ఉండి నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి రఘురామకృష్ణరాజు, అన్నవరం, విజయనగరం, విశాఖ పట్నం వంటి ప్రాంతాల్లో కూటమి ముఖ్యులతో భేటీ అవుతూ వచ్చారు. ఎన్నికలు పూర్తయిన దగ్గర నుంచి రఘురామకృష్ణరాజు మరింత బిజిబిజీగా మారారు. వైసీపీ అభ్యర్థి పి.వి.ఎల్.నరసింహరాజు హైదరాబాద్ వెళ్ళి సేద తీరుతున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన శివరామ రాజు సింహాచలంలో బస చేసినట్టు చెబుతున్నారు. తణుకులో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హైదరాబాద్‌కు వెళ్ళి సేద తీరుతున్నట్టు సమాచారం. ఇదే నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు నుంచి కాలుకదపకుండా అక్కడే ఉండి గ్రామాల వారీగా అసలేం జరిగిందో ఆరాలో మునిగి తేలుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఉండగా, వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు కైకలూరులో ఉండి పార్టీ శ్రేణులతో నిత్యం చర్చించే పనిలో పడ్డారు. తాడేపల్లిగూడెంలో మరో మంత్రి కొట్టు సత్యనారాయణ ఎన్నికల తర్వాత స్థానికంగానే ఉండిపోయారు. నియోజకవర్గంలో ఎక్కడెక్కడ బలం, బలహీనత అనే దానిపై పునః సమీక్షించుకుంటున్నారు. ఇక్కడ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో శ్రీలంకకు వెళ్ళారు. చింతలపూడి నియోజకవర్గానికి చెందిన కూటమి అభ్యర్థి రోషన్‌కుమార్, హైదరాబాద్‌లో మకాం వేయగా, వైసీపీ అభ్యర్థి విజయ్‌రాజు చెన్నైలో బస చేశారు. అక్కడ విజయరాజు కుమారుడు ఐపీఎస్ అధికారిగా ఉన్నారు. నూజివీడు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావు హైదరాబాద్‌కు వెళ్లగా కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి హైదరాబాద్ - విజయవాడ, నూజివీడుల మధ్య చక్కెర్లు కొడుతున్నారు. ఆచంట నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ హైదరాబాద్ వెళ్ళగా వైసీపీ అభ్యర్థి రంగనాథరాజు కుటుంబసభ్యులతో కలిసి ఊటికి వెళ్ళారు. పాలకొల్లు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు స్థానికంగానే ఉంటూ అక్కడి ప్రజల సమస్యలపై స్పందిస్తూ తక్షణ చర్యలకు దిగడం విశేషం.

జూన్‌లోను రేషన్ పంపిణీకి.. వలంటీర్లు దూరం

ఏలూరు సిటీ, మే 23 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో రేషన్ పంపిణీలో వలంటీర్లు పాల్గొనే అవకాశాలు లేవు. ఏప్రిల్, మే నెలలో జరిగిన విధంగానే వలంటీర్లు లేకుండానే రేషన్‌ను ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తారు. గతనెల కందిపప్పు అంతగా పంపిణీ చేయ లేదన్న విమర్శలు ఉన్నాయి. డీలర్లు డీడీలు చెల్లించకపోవడంతో కందిపప్పు సరఫరా లేదని అధికారులు చెబుతుండగా, కందిపప్పు కొరత వల్లే సరఫరా జరగలేదని డీలర్లు చెబుతున్నారు. పంచదార ఆలస్యంగా రావడంతో పంపిణీ అంతంత మాత్రంగానే జరిగిందని చెబుతున్నారు. కార్డులోని ఒక్కొక్క వ్యక్తికి ఐదు కిలోలు చొప్పున బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తామని, పంచదార, కందిపప్పు, ప్రజల అవసరాలకు అనుగుణంగా గోధుమ పిండి సబ్సిడీ ధరలకు అందజేయనున్నట్టు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు చెబుతున్నారు. మే నెలలో రేషన్ పంపిణీ 18 రోజుల పాటు కొనసాగింది. జిల్లాలో మొత్తం 6లక్షల 34వేల 148 మంది రేషన్ కార్డుదారులు ఉండగా 395 ఎండీయూ వాహనాల ద్వారా ఆపరేటర్లు రేషన్ పంపిణీ చేయనున్నారు. అయితే వారు పూర్తి స్థాయిలో ఇంటింటికీ సరఫరా చేయడం లేదని, ఒక సెంటర్‌లో ఆగిపోయి రేషన్ పంపిణీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

కొల్లేరు బీటలు

- ఎండిన అతిపెద్ద మంచినీటి సరస్సు
- మనుగడ కోల్పోయిన మత్స్య సంపద
- గుక్కెడు నీళ్ల కోసం తిప్పలు అనేకం
- ఆటపాక.. పక్షుల కేంద్రానికే పరిమితం

7

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం : కలెక్టర్

ఏలూరు సిటీ, మే 23 : సాధారణ ఎన్నికలు- 2024లో భాగంగా కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. ఏపీ సచివాలయం కాన్ఫరెన్స్ హాలు నుంచి కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, తదితరులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. ఏలూరులోని కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ లావణ్య వేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, డీఆర్వో పుష్పమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు- 2024లో భాగంగా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లను చేపడుతున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నా మన్నారు. సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాల పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, కౌంటింగ్ కోసం అడిషినల్ ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో పరిశీలకులను నియమించామని, మొదటి ర్యాండమైజేషన్, శిక్షణ ఈనెల 27న నిర్వహిస్తామన్నారు. వివిధ నియోజకవర్గాల ఆర్వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు..

ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'ప్రశాంతంగా, పారదర్శకంగా ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు, రాజకీయ పక్షాలు సహకరించాలి. అభ్యర్థులు వారి కౌంటింగ్ ఏజెంట్లుగా పంపేవారి పూర్తి వివరాలను ఫారం-18లో ఈనెలాఖరు నాటికి సమర్పించాలి. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అభ్యర్థితో పాటు అందరి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు అనుమతించబడవు. రౌండ్ వారీ ఫలితాలను డిస్‌ప్లే చేస్తారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సంబంధించి ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారు. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదేసి చొప్పున వీవీప్యాట్‌లలో ఓట్లను లెక్కిస్తారు. ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి ఇద్దరు, ముగ్గురు చొప్పున కౌంటింగ్ ప్రక్రియను నిర్దేశిత ప్రాంతం నుంచి చిత్రీకరించాలే తప్ప ఈవీఎంలను జూమ్ చేసి తీసేందుకు వీలులేదు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల విజయోత్సవాలకు సంబంధించి ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదు. బాణసంచా కాల్పడంపై నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాలుకు వచ్చేటప్పుడు డూప్లికేట్ ఫారం -17సీ, వైట్‌పేపర్, పెన్నులతో హాజరు కావాలి'.. అన్నారు. డీఆర్వో పుష్పమణి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాలివే..

కౌంటింగ్ ప్రక్రియపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక దృష్టి సారించారు. వచ్చే నెల 4వ తేదీన వట్లూరులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు పెద్ద ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ బ్లాక్ డ్రాయింగ్ హాల్‌లో, దెందులూరు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి ఎంబీఏ బ్లాక్ మొదటి అంతస్థులో, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సీఎస్‌ఈ బ్లాక్ రెండో అంతస్థులో, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మెకానిక్ బ్లాక్ రెండో అంతస్థులో, నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మెకానిక్ బ్లాక్ రెండో అంతస్థు డ్రాయింగ్ హాల్‌లో, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐటీ బ్లాక్ నాల్గవ అంతస్థులో ఓట్ల లెక్కింపు కార్యక్రమం చేపట్టేందుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అందరూ సహకరించాలి : ఎస్పీ

ఏలూరు క్రైం, మే 23 : జిల్లాలో ప్రజా శాంతికి భంగం కలుగకుండా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి సూచించారు. జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తుగా రాజకీయ పార్టీ ప్రతి నిధులతో ఏలూరులోని గిరిజన భవనంలో సమావేశాన్ని గురువారం పోలీస్‌శాఖ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జూన్ 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని జిల్లా వ్యాప్తంగా సీఆర్పీసీ 144 సెక్షన్,



పోలీస్ యాక్టు 30 అమలులో ఉన్నందున ప్రజలు నలుగురికి మించి గుంపుగా ఉండరాదని, కౌంటింగ్ రోజున అనవసరంగా రోడ్లపైకి వచ్చి గొడవలకు కారణం కావద్దని, క్రిమినల్ కేసుల్లో చిక్కుకోవద్దని సూచించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ఇతరులను కించపరిచే వ్యాఖ్యలు చేయరాదని అన్ని రాజకీయపార్టీల వారు శాంతియుతంగా ఉండాలని ముందస్తుగా అనుమతులు లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు చేయకూడదన్నారు. జూన్ 6వ తేదీ వరకు నమోదు అయ్యే క్రిమినల్ కేసులన్నింటిని ప్రత్యేకంగా పర్యవేక్షించి శిక్ష పడే విధంగా ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్పీ స్వరూపరాణి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసులు, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, కైకలూరు రూరల్ ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు కలెక్టరేట్, మే 23: ఇంటర్, పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం జరుగుతాయి. దీనికి సంబంధించి జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 12,797 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొదటి సంవత్సరం జనరల్ కింద 7,744 మంది, ఒకేషనల్ 920 మంది మొత్తం 8,664 మంది హాజరవుతారు. రెండో సంవత్సరానికి సంబంధించి జనరల్ కింద 3,209 మంది, ఒకేషనల్ కింద 924 మంది మొత్తం 4,133 మంది హాజరు కానున్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ఇలా..

10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరుగుతాయి. పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. ఈ పరీక్షలకు 11,533 మంది హాజరు కానున్నారు. వీరిలో బాలురు 6,970 మంది, బాలికలు 4,563 మంది పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందు హాజరు కావాలి. దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. విద్యార్థులు ఇబ్బందులు లేకుండా సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపను న్నారు. 50 పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్‌లు, ఇన్విజి లేటర్లను, తనిఖీలకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియ మించారు. ఏదైనా సమస్య తలెత్తితే కంట్రోల్ రూమ్ 81218 40400 నెంబర్‌లో సంప్రదించాలని జిల్లావిద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

లంచం ఇస్తే..అంతా ఓకే!

- ఇంజనీరింగ్ సెక్షన్‌లో అవినీతిపై ఆరోపణలు
- విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు
- నోటీసులు జారీ చేసిన వైనం



ఏలూరు టూటౌన్, మే 23 : నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ సెక్షన్‌లో అవినీతి పెచ్చుమీరిందన్న ఆరోపణలున్నాయి. ప్రతీ పనికి లంచం ఇవ్వాలని, కాంట్రాక్టర్ల దగ్గర నుంచి పర్సంటేజీలు తీసుకుంటున్నారని, పనుల్లో నాణ్యత లేకపోయిన పర్సంటేజ్ ఇస్తే సరిపోతుందన్న ఆరోపణలు ఉన్నాయి. నగర పాలక సంస్థలో రోడ్లు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనుల్లో అవినీతి రాజ్యమేలుతోందని చాలాకాలం నుంచి ఆ నోట ఈనోట వినిపిస్తోంది. కొన్ని పనులను టెండర్లు పిలవకుండానే నామినేషన్ పద్ధతిలో కేటాయిం చేస్తున్నారు. ఇంజ నీరింగ్ సెక్షన్‌లో ఒక ఉన్నతాధికారి ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో కొన్ని నెలల నుంచి సంతకాలు పెట్టడంలోనే నిమగ్నమైనట్టు తెలుస్తోంది. అసలు పని జరిగిందా లేదా, నాణ్యత ఉందా లేదా అనేది క్షేత్రస్థాయిలో పరిశీలనే లేదని, కొన్ని రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేయకుండానే బిల్లులు పెట్టి కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు పంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంజనీరింగ్ సెక్షన్‌లో అతిపెద్ద కుంభకోణంగా ఆయిల్ కుంభకోణం జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఇంజనీరింగ్ సెక్షన్‌పై విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టారు. దీనికి తోడు ఒక ప్రైవేటు వ్యక్తి ఇంజనీరింగ్ సెక్షన్‌లో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై మునిసిపల్ ఇంజనీర్‌కు విజిలెన్స్ అధికారులు నోటీసులు పంపారు. 2021 - 22, 2022- 23 సంవత్సరంలో ఇంజనీరింగ్ సెక్షన్ చేపట్టిన కాంట్రాక్టు పనులు వివరాలు, ఎంత మొత్తంలో జరిగాయో ఆ వివరాలు పంపాలంటూ విజిలెన్స్ అధికారులు తాకీదులు పంపారు. నామినేషన్‌పై ఎన్ని వర్కులు జరిగినవి, టెండర్ల ద్వారా ఎన్ని పనులు జరిగాయో తెలపాలన్నారు. రూ.ఐదు లక్షల లోపు అయితే నామినేషన్ పద్ధతిలో పనులు కట్టబెట్టవచ్చు. ఆపై కచ్చితంగా టెండర్లు పిలవాల్సిందే. అయితే రూ.ఐదు లక్షలు పైబడిన పనులను కూడా నామినేషన్ పద్ధతిలో కేటాయించారనే విమర్శలున్నాయి. టెండర్ ద్వారా పనులు జరిగితే ఆ కాంట్రాక్టర్‌కు 13.615 పర్సంటేజి కాంట్రాక్టరుకు లాభాల రూపంలో ప్రభుత్వ జీవో ప్రకారం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఈ పర్సంటేజ్‌లను నామినేషన్ పద్ధతిలో ద్వారా పనులు కేటాయించిన వారికి కూడా మున్సిపల్ అధికారులు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పైవన్నీ కూడా రికార్డులతో సహ సిద్ధం చేసి ఉంచాలని విజిలెన్స్ అదికారులు తాకీదులు పంపారు. దీంతో అప్రమత్తమైన ఇంజనీరింగ్ విభాగంలో కొందరు అధికారులు, సిబ్బంది రికార్డులు తారుమారు చేసే పనిలో నిమగ్నమయ్యారన్న గుసగుసలు విన్పిస్తున్నాయి. కాగా మునిసిపల్ ఇంజనీర్ భాస్కర్‌ను వివరణ కోరగా విజిలెన్స్ తాకీదులు తనకు అందలేదని తెలిపారు.

కొల్లేరు బీటలు

ఎండిన అతిపెద్ద మంచినీటి సరస్సు



- మనుగడ కోల్పోయిన మత్స్య సంపద
- గుక్కెడు నీళ్ల కోసం తిప్పలు అనేకం
- ఆటపాక.. పక్షుల కేంద్రానికే పరిమితం

కొల్లేరు కళ తప్పి ఎడారిని తలపిస్తోంది. పరవళ్ళు తొక్కే మంచినీటి సరస్సు వెలవెలబోతుంది. పచ్చని భూములు బీటలు వారాయి. పక్షుల కిలకిలరావాలు ప్రకృతి సోయగాలు కనిపించడంలేదు. సరస్సు అందాలు ఆవిరయ్యాయి. ఆసియా ఖండంలోనే అతిపెద్ద సరస్సుగా పేరొందిన కొల్లేరులో నేడు మనుషులకే కాదు పక్షులకూ గుక్కెడు నీరు దొరకని పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడక్కడ ఉన్న నీటి కుంటల్లో పక్షులు సేద తీరుతున్నాయి. కొల్లేరును చూస్తే ఇది మంచినీటి సరస్సేనా అని సందేహం కలుగుతుంది. ఎప్పుడూ నీళ్లతో కళకళలాడే కొల్లేరు సరస్సు నేల బీటలు వారిన దుస్థితి నెలకొంది.

- కైకలూరు, మే 23 :

ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో సరస్సులో నీరు లేదు. 77,138 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొల్లేరు సరస్సుకు సుమారు 60 మీడియం, మైనర్ డ్రెయిన్లు, కాలువల నుంచి పది టీఎంసీల నీరు కొల్లేరులోకి ప్రతీ ఏడాది చేరుతుందని నిపుణులు అంచనా వేసేవారు. కళకళలాడుతున్న కొల్లేరులోని నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రమార్గం ద్వారా ప్రవహించి సరస్సు అంతర్భాగంలో ఐదు టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని అంచనా. నేడు అందుకు భిన్నంగా సరస్సు ఎడారిని తలపిస్తోంది. వాతావరణ సమతుల్యత దెబ్బతిని సరస్సు కళ కోల్పోయింది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేవి. రానురాను భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. పది అడుగులు లోతు వెళితే ఉప్పునీరు వస్తుంది.

సుదీర్ఘ ప్రాంతాలకు వలసలు



ఒడ్డుకు చేరిన మత్స్యకారుల దోనెలు

నీటి కళతో కళకళలాడుతున్న సమయంలో కొల్లేరు ప్రజలు సంప్రదాయ చేపలవేట చేసుకుని జీవనం సాగించేవారు. చేపల వేటపై ఆధారపడే వేలాది కుటుంబాలు జీవించేవి. నేడు నీరు లేక చేసేదిలేక ప్రజలు సుదీర్ఘ ప్రాంతాలకు వలసలు పోతున్నారు. సుమారు 50 ఏళ్ల కాలంగా ఇలాంటి దుస్థితి కానరాలేదు. గత మూడు, నాలుగేళ్ల కాలంలో కొద్దిమేర నీటి నిల్వలు ఉండేవి. ఈ పరిస్థితిని ఎన్నడూ చూడలేదని కొల్లేటిలోని ప్రజలు వాపోతున్నారు. ఉప్పుటేరు నుంచి సముద్రపు పోటు కలిగి కైకలూరు, ఆకివీడు మండలాల్లోని కొల్లేరు సరస్సులోకి ఉప్పుటేరు ప్రవహిస్తుంది. ఈ నీటి వల్ల మత్స్యసంపదకు నష్టం వాటిల్లితుంది. ఈ నీరు పశువులు తాగేందుకు కూడా పనికిరావడం లేదు.

తిరుగు ముఖం పడుతున్న పక్షులు

కొల్లేరులో సామర్థ్యానికి తగిన నీటి నిల్వలు లేకపోవడంతో సుదీర్ఘ ప్రాంతం నుంచి వచ్చే వలసపక్షులు కూడా తిరిగిముఖం పట్టాయి. కొల్లేరులో లభించే 80 రకాల మత్స్యసంపద మనుగడ ప్రశ్నార్థకమైంది. కైకలూరు నుంచి ఏలూరు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న కొల్లేరు సరస్సులో చిన్నచిన్న నీటికుంటలు కన్పించిన దాఖలులు లేవు. ఎంత వర్షాభావం తక్కువగా ఉన్న చిన్న, పెద్ద ఎడ్లగాడిలో ఎప్పుడూ నీరు ప్రవహిస్తూనే ఉండేది. అలాంటిది ఈ ఏడాది గాడిల్లో నీరు లేక నేలబీటలు వారింది. కొల్లేరు అభయారణ్యప్రాంతంలో అక్కడక్కడ పచ్చిక బైల్లు కూడా ఎండిపోవడంతో పశువులకు మేత దొరకడం లేదు. పలు దేశాల నుంచి వచ్చే వలస పక్షులకు ఆటపాకలోని 310 ఎకరాల్లో ఏర్పాటుచేసిన పక్షుల కేంద్రంలో తప్ప ఎక్కడా నీరు దొరికే పరస్థితి కనిపించడం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పక్షులు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిపోతున్నాయి.

ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మించాలి..

గతంలో కొల్లేరులో సరస్సు ఎగువ భాగాన పంటలు పుష్కలంగా పండేవి. ఏ గ్రామంలో చూసినా వ్యవసాయం ఉండడంతో రెండు పంటలకు నీరు అందడంతో ఆ నీటిని కాలువలు, డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోనికి వదిలే వారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా చేపలచెరువులే కనిపించడంతో ఉన్న నీటిని కొందరు సైక్లింగ్ చేసుకోవడమే తప్ప దిగువ కొల్లేరులోకి నీరు వదిలే పరిస్థితులు లేవు. ఇప్పటికైనా ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మించేలా ప్రకృతి ప్రేమికులు, నిపుణులు కోరుకుంటున్నారు.

నీటి నిల్వలు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం

కొల్లేరు సరస్సులోకి నీరు వచ్చే సుమారు 60 మేజర్, మైనర్ డ్రెయిన్లు పూడుకుపోవడంతో నీరు ఎగువ నుంచి సరస్సులోకి చేరడం లేదు. వీటి ఆధునికీకరణ కోసం అటవీశాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధునికీకరణ పనులు చేపట్టినీరు నిల్వలు పెంచేందుకు కృషి చేస్తాం.

కేవీ నాగలింగాచార్యులు,
అటవీశాఖ రేంజర్, కైకలూరు

రెగ్యులేటర్ నిర్మించాలి



పేరుకే కొల్లేరు మంచినీటి సరస్సు పుస్తకాల్లోనూ, రికార్డుల్లో మాత్రమే ఇది వర్తిస్తుంది. తాగేందుకు చుక్క నీరు లేదు. ఎగువ ప్రాంతాల్లోని రైతులు వారి అవసరాలకు అడ్డుకట్టు వేసి దిగువకు నీరు పారుదల జరగకుండా ఆపడంతో డిసెంబరు నెలకే సరస్సు ఎడారిలా మారిపోతుంది. నీరు నిల్వ చేసుకునేందుకు రెగ్యులేటర్ నిర్మాణం చేసేలా ప్రభుత్వాలు కృషి చేయాలి.

- ఘంటసాల వెంకటేశ్వరరావు
కొవ్వాడలంక

కొల్లేరులో నీళ్లు తాగేవాళ్లం




వర్షాకాలంలో కొల్లేరులో కొద్దిమేర నీరు ఉన్నప్పటికి అనతి కాలంలోనే ఎండిపోవడంతో తాగేందుకు, పశువులకు సైతం నీరు, మేత దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతీ ఏడాది ఇదే పరిస్థితి కొనసాగుతుంది. మా చిన్న తనంలో కొల్లేరులోని నీటినే తాగి జీవించేవాళ్ళం. ప్రస్తుతం కైకలూరు, ఆటపాక ప్రాంతాల నుంచి నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- పోతురాజు మహేష్,
కోమటిలంక

పట్టిసీమ పట్టదా ?

- కోతకు గురైన అవుట్ ఫాల్ స్లూయిజ్ గట్టు



పంచాయతీ కార్యాలయం వద్ద కోతకు గురైన దృశ్యం

పోలవరం, మే 23 : వర్షాకాల సీజన్‌లో కొవ్వాడ కాలువ, కొండవాగుల జలాలు పంట పొలాలను ముంచెత్తి ఇసుకమేటలు వేసి రైతులు నష్టపోతున్న నేపథ్యంలో కొండవాగుల జలాలు గోదావరిలోకి వెళ్లేలా గోదావరి జలాలు లోపలికి రాకుండా ఇరిగేషన్ అధికారులు పట్టిసీమ వద్ద అవుట్ ఫాల్ స్లూయిజ్ నిర్మించారు. పట్టిసీమ గ్రామం వద్ద కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్‌కి గోదావరి వైపు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించకపోవడం వల్ల గట్టు కోతకు గురయ్యింది. పట్టిసీమ పంచాయతీ కార్యాలయం గోడల కింద వరకు గట్టు కోతకు గురవుతోంది. దీని వల్ల రానున్న వర్షాకాలంలో కొండవాగుల వరద జలాల ఉధృతికి మరింత కోతకు గురై పంచాయతీ కార్యాలయం, కార్యాలయం పైనున్న గ్రామ రెవెన్యూ కార్యాలయం కాల్వలోకి పడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గత మార్చిలో పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చిన ఏలూరు జిల్లా జేసీ లావణ్యవేణి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య దృష్టికి స్థానికులు సమస్యను తెలుపగా.. పరిస్థితి పరిశీలించి ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు ఈ విషయంలో ఏ ఒక్క అధికారి పట్టించుకున్న దాఖలాలు లేవు. నిర్లక్ష్యంగా వదిలేస్తే ఈ వర్షాల సీజనుకి పట్టిసీమ శివక్షేత్రానికి వెళ్లే ఫెర్రీ రేవు కొట్టుకుపోయే అవకాశాలున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కొవ్వాడ కాల్వ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సీహెచ్ భాస్కర్‌ని వివరణ కోరగా అవుట్ ఫాల్ స్లూయిజ్‌కి ఇరువైపులా రక్షణ గోడ, స్పిల్ ఛానల్ కాంక్రీట్ పనుల నిర్మాణం కోసం ఒక కోటి 12 లక్షల రూపాయల నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని నిధులు మంజూరైన తర్వాత నిర్మాణం చేపడతామన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఈఏపీ సెట్

ఏలూరు రూరల్/భీమవరం రూరల్, మే 23: ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫారసీ (ఈఏపీసెట్) 2024 పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈనెల 16 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా 23వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. 16,17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ(బైపీసీ స్ట్రీమ్) పరీక్షలు జరగ్గా, 18 నుంచి 23 వరకు ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఎంపీసీ స్ట్రీమ్) పరీక్షలు జరిగాయి. ఏలూరు జిల్లాలోని ఏలూరులో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. చివరి రోజు 483కు గాను 469 మంది విద్యార్థులు హాజరు కాగా, 14మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో చివరి రోజు భీమవరంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 171కి 159, డీఎన్నార్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 150కి 143 మంది విద్యార్థులు, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 100 మందికి 97ని, నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో 156కి 150 మంది విద్యార్థులు హాజరయ్యారు.

జనరల్ సర్జరీ, ఈఎన్‌టీల్లో
ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభిస్తాం



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న దాత గుప్తా

ద్వారకాతిరుమల, మే23: విర్డ్ ఆసుపత్రిలో జనరల్ సర్జరీ, ఈఎన్‌టీల్లో ఆరోగ్యశ్రీ సేవలను త్వరలో అందుబాటులోకి తెస్తామని విర్డ్ ఆసుపత్రి చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. స్థానిక విర్డ్ ఆసుపత్రిలో గురువారం సుధాకరరావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం 23మంది దివ్యాంగులకు కాలిపర్స్, కృత్రిమ అవయవాలను గుప్తా ఫౌండేషన్ సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వి.ఆనందరాజు, ట్రస్టీలు ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణమూర్తి, ఎంఎం గుప్తా, రాజబాబు, వంశీ, ఈవో త్రినాధరావు, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, ఏవో ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ చెస్ ఛాంపియన్ లక్ష్మణరావు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఏలూరుటూటౌన్, మే 23: జిల్లా సీనియర్ చెస్ ఛాంపియన్‌గా లక్ష్మణరావు ఎంపికయ్యారు. జిల్లా చెస్ అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో దీప్తి చెస్ అకాడమిలో గురువారం జిల్లా సీనియర్ చెస్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు జరిగాయి. జిల్లా నుంచి 40మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి నలుగురు క్రీడాకారులు ఈనెల 28, 29 తేదీల్లో విజయవాడలో జరగబోయే రాష్ట్ర పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఏలూరు చెస్ అడ్‌హాక్ కమిటీ కో-ఆర్డినేటర్ ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. పోటీల్లో మొదటి స్థానం లక్ష్మణరావు, రెండో స్థానం సుచిత్ర, మూడో స్థానం రక్షిత, నాలుగో స్థానంలో సోనాలి కార్తీక నిలిచారు. మొదటి నాలుగు స్థానాలు పొందిన క్రీడాకారులకు సిట్ కంప్యూటర్స్ అధినేత కావూరి వేణుగోపాల్, దీప్తి చెస్ అకాడమి డైరెక్టర్ కే.కృష్ణకుమారి, కో-ఆర్డినేటర్ ఎస్.కోటేశ్వరరావు, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ కే.శివరంగనాధ్, క్రీడాకారులకు బహుమతుల ప్రదానం చేశారు.

సీహెచ్‌సీ సిబ్బంది పనితీరుపై పీవో ఆగ్రహం

ఏజెన్సీ అలవెన్స్‌లు నిలుపుదల చేయాలి.. వైద్యులు, సిబ్బంది పనితీరుపై నివేదిక ఇవ్వాలని డీఎంవోకు ఆదేశం



బుట్టాయగూడెం సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న పీవో సూర్యతేజ

బుట్టాయగూడెం, మే 23 :బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది పనితీరుపై కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.సూర్యతేజ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి ఆసుపత్రికి వెళ్లగా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజామున రెండు గంటల వరకు పీవో ఆసుపత్రిలో ఉండి పనితీరును, రికార్డులను, వైద్యులు, సిబ్బంది విధుల సమయాలను పర్యవేక్షించారు. ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఏజెన్సీ అలవెన్సులు నిలుపుదల చేయాలని డీఎంవోను ఆదేశించారు. బుద్దులవారిగూడెంకు చెందిన బుద్దుల ప్రేమ్‌కుమార్ సైకిల్ తొక్కుతూ ఈనెల 20న కిందపడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని తాత గాంధీ బుట్టాయగూడెం సీహెచ్‌సీకి తీసుకురాగా ప్రాథమిక వైద్యం అందించిన వైద్యులు, సిబ్బంది తలకు తగిలిన గాయానికి మెరుగైన వైద్యసేవలు అందించలేదు. రెండు రోజులు తర్వాత మనుమడికి వైద్య అందించాలని కోరినా ఆసుపత్రిలో పట్టించుకోకపోవడంతో వైద్యులు, సిబ్బందిని నిలదీయడంతో ఆసుపత్రి వర్గాలు తమపై దౌర్జన్యం చేస్తున్నారంటూ పోలీసులకు చెప్పడమేకాకుండా ప్రేమ్‌కుమార్‌ను ఇంటికి పంపించడంతో ఈ విషయం సీరియస్ అయ్యింది. జరిగిన విషయాన్ని తాత గాంధీ ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై ఆగ్రహించిన పీవో ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు మూడు గంటల పాటు ఆసుపత్రిలో ఉండి వైద్యులు, సిబ్బంది డ్యూటీకి రావడం, వెళ్ళడం, వైద్యసేవలు అందించడం, రికార్డుల నమోదు తదితర విషయాలను పరిశీలించారు. పీవో ఆసుపత్రికి వచ్చినపుడు ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది అలసత్వంపై నిలదీశారు. రోగులకు భోజనం పెట్టాల్సి ఉండగా బుధవారం రాత్రి పెట్టకపోవడాన్ని గుర్తించి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం కొనేందుకు ఆసుపత్రికి రూ.20 వేల నిధి ఉంటుందని మోతుగూడెం నుంచి డెలివరీకి వచ్చిన కొండరెడ్డి గర్భిణికి రక్తం తక్కువగా ఉంటే వారినే తెచ్చుకోమనడం ఏమిటని నిలదీశారు. ఆరోగ్యశ్రీ అమలులో ఉన్న ఆసుపత్రిలో ఆరోగ్యమిత్రలు ఎందుకులేరని ప్రశ్నించారు. గాయపడిన బాలుడికి తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రేమ్‌కుమార్ నందాపురం పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్నాడు. ఆసుపత్రి పనితీరుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డీఎంవో జె.సురేష్‌కుమార్‌ను ఆదేశించారు.

రాజమన్నార్‌గా చిన వెంకన్న



రాజమన్నార్ అలంకరణలో శ్రీవారు

ద్వారకాతిరుమల, మే 23: వైశాఖ మాస దివ్యబ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం అనంతరం బుధవారం అర్ధరాత్రి వెండి గరుడవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అలంకరించిన అర్చకులు అట్టహాసంగా తిరువీధిసేవ జరిపారు. ఉత్సవంలో భక్తులు పాల్గొని స్వామికి హారతులను సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజుకో అలంకరణలో కటాక్షిస్తున్న స్వామి వారు గురువారం చంద్రకోలు, దండం ధరించి సర్వాభరణాలతో రాజమన్నార్‌గా భక్తులను అనుగ్రహించారు.

శ్రీవారి రథోత్సవం రద్దు

చినవెంకన్న క్షేత్రంలో గురువారం రాత్రి జరగాల్సిన రథోత్సవం అనివార్య కారణాల వల్ల రద్దు చేశామని ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు ప్రకటించారు. కల్యాణం మరుసటి రోజున రథోత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయం. రథాన్ని ఆలయ ప్రధానకూడలికి తెచ్చి పచ్చిపూలతో, విద్యుత్‌దీప తోరణాలతో సుందరీకరించారు. ఏర్పాట్లు పూర్తయిన అనంతరం సాయంత్రం గ్రామంలో ఆసౌచం(మరణం) ఏర్పడడం వల్ల ఉత్సవాన్ని నిలుపుదల చేశారు.

బీఎల్‌వోలకు గౌరవ వేతనం విడుదల చేయాలి

ఏలూరు కలెక్టరేట్, మే 23 : రాష్ట్రంలో ఎన్నికల్లో పనిచేసిన బీఎల్‌వోలకు ఇచ్చే గౌరవవేతనం గత మూడేళ్ళుగా ఇవ్వడం లేదని తక్షణం మూడేళ్ళకు సంబంధించి గౌరవవేతనం విడుదల చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావును విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు ఒక్కొక్క బీఎల్‌వోకు రూ.18వేలు రావాల్సి ఉందన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలకు సంబంధించి ఒక్కొక్క పోలింగ్ స్టేషన్‌కు సుమారు రూ.10 వేలు వరకు రకరకాలుగా ఖర్చు పెట్టారని, దీనివల్ల వీఆర్వోలు, బీఎల్‌వోలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్పష్టం చేశారు. ఒక్కొక్క బీఎల్‌వోకు రూ.10వేలు ఇచ్చేలా రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. గౌరవవేతనం ఫైల్ ఫైనాన్స్‌లో ఉందని, త్వరలో నిధులు విడుదల చేస్తారని ఎన్నికల అదనపు ప్రధాన అధికారి కోటేశ్వరరావు హామీ ఇచ్చారని తెలిపారు. గ్రేడ్-2 వీఆర్వోల ప్రొహిబిషన్‌కు సంబంధించి ప్రభుత్వం మెమో ఇచ్చి మూడు నెలలు అవుతున్నా జిల్లా అధికారులు ప్రొహిబిషన్ విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం వారందరికి ప్రొహిబిషన్ డిక్లేర్ చేయాలని, సీసీఎల్ఏ అధికారులను కోరినట్లు వివరించారు. కారుణ్య నియామకం ద్వారా నియమితులైన వారికి కూడా ప్రొహిబిషన్ డిక్లేర్ చేయాలని రెవెన్యూ డిప్యూటీ సెక్రటరీని కోరినట్లు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.లక్ష్మీనారాయణ, బాలాజిరెడ్డి, హనుమంతు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు హద్దు మీరితే.. ఫిర్యాదు చేయండి

- పైసా ఖర్చులేదు.. ఆరు నెలల్లో పరిష్కారం
- పోలీసు కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ విశ్వనాథం

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): పోలీసులు విధులు దుర్వినియోగం చేసిన సందర్భాల్లో వారిపై పోలీసు కంప్లైంట్స్ అథారిటీకి బాధితులు లేదా వారి సంబంధీకులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని అథారిటీ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఆర్‌జే విశ్వనాథం పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని అథారిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలోని కానిస్టేబుళ్ల దగ్గర నుంచి డీఎస్పీ స్థాయి వరకు వచ్చే ఫిర్యాదులపై విచారణ చేపట్టే అధికారం రాజమహేంద్రవరం కేంద్రంగా పనిచేస్తున్న అథారిటీకి ఉందన్నారు. గుంటూరులో ఉన్న రాష్ట్రస్థాయి అథారిటీకి ఎస్పీ నుంచి డీజీ వరకూ అధికార పరిధి ఉందన్నారు. తమ పరిధిలోని ఏదైనా జిల్లాకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తే అక్కడికే వెళ్లి విచారణ చేపడతామని చెప్పారు. ఫిర్యాదుదారులు dpcarajamahendravaram@gmail.com మెయిల్ ద్వారా లేదా 99484 64363 నంబరుకు వాట్సాప్ ద్వారా లేదా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ, వైటీసీ, బొమ్మూరు, రాజమహేంద్రవరం రూరల్‌కి రిజిస్టరు పోస్టు ద్వారా తమ అర్జీలను పంపించవచ్చని తెలిపారు. తమ కార్యాలయానికి వచ్చి నేరుగా సమస్యను తెలిపి ఫిర్యాదు అందజేయవచ్చన్నారు. కస్టడీలో మరణించడం, అత్యాచారం, కస్టడీలో తీవ్ర గాయాలు కావడం, భూ కబ్జాలు, సివిల్ తగాదాల్లో కల్పించుకోవడం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి వ్యక్తులను ఇబ్బంది పెట్టడం వంటి వాటిపై ఘటన జరిగిన రోజు నుంచి ఏడాది లోపుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీనికి ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గరిష్ఠంగా ఆరు నెలలలోపుగా విచారణ పూర్తి చేసి సదరు ఉద్యోగి విధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని రుజువైతే చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. పోలీసులపై ఫిర్యాదు చేస్తే వారితో ఇబ్బందులు ఎదుర్కో వాల్సి వస్తుందన్న భయం అవసరం లేదన్నారు. అథారిటీ ఏర్పాటైన తర్వాత 14 ఫిర్యాదులపై విచారణ జరిపి 10 కేసులకు పరిష్కారం చూపించా మన్నారు. 4 కేసుల విచారణ వివిధ దశల్లో ఉందన్నారు. అథారిటీపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అథారిటీ సభ్యులు విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎం.జితేంద్ర, విశ్రాంత ఏఎస్పీ బి.లక్ష్మీనారాయణ, న్యాయవాది మన్మథరావు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

160 కేజీల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, మే 23: ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతికి అందిన సమాచారంతో ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఓ కారును తనిఖీలు చేయగా అందులో ఎనిమిది గోనె సంచులలో ఒక్కొక్క సంచిలో పది ప్యాకెట్లు గంజాయి ఉండడాన్ని గుర్తించారు. మొత్తం 160 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 10 లక్షల 55 వేలు ఉంటుందని గుర్తించారు. వాహనంలో ఉన్న నిందితులైన మహారాష్ట్రకు చెందిన బరమతి గ్రామానికి చెందిన జామీర్ పింజరి, మహారాష్ట్రలోని థానీ జిల్లాకు బివన్ గ్రామానికి చెందిన అంతిక్యూ అహ్మద్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఏలూరు ఎస్ఈబీ స్టేషన్ సీఐ కె. విద్యాసుధాకర్, ఎస్ఐ వి.శివప్రసాద్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, పాల్గొన్నారు. వీరిని అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అభినందించారు.

నకిలీ లెమన్ డ్రింక్స్ తయారీ కంపెనీపై దాడి

ఏలూరు క్రైం/తాడేపల్లిగూడెం రూరల్, మే 23 : తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెంలో సెవెన్ స్టార్స్ బాట్లింగ్ కంపెనీలో నకిలీ కూల్ డ్రింక్స్ తయారవుతున్నాయని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ యూజే విల్సన్, ఎస్ఐ రంజిత్‌కుమార్, ఫుడ్‌సేఫ్టీ అధికారి సుందరరామిరెడ్డి, తూనికలు కొలతల అధికారి అప్పలనాయుడు వారి సిబ్బందితో గురువారం సాయంత్రం ఆ కంపెనీపై దాడి చేశారు. అక్కడ అనధికారికంగా లెమన్ సాఫ్ట్ డ్రింకులు తయారు చేసి వాటిని సీసాల్లో నిల్వ చేసి వాహనాల్లో చుట్టుపక్కల పట్టణాలు, ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లుగా గుర్తించారు. అక్కడ వాడుతున్న రసాయనాలను, ఇతర సామగ్రిని తనిఖీలు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆ డ్రింక్‌లను తయారు చేస్తున్నట్లు గుర్తించి ఆ కంపెనీ యజమాని చింతా శివకుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అక్కడ ఉన్న బాటిల్స్‌ను సీజ్ చేశారు.

కృష్ణబాబుకు ఎంపీ రఘురామ నివాళులు



దొమ్మేరులో ఆంధ్రా సుగర్స్ చైర్మన్ నరేంద్రనాథ్ చౌదరి, జేఎండీ అచ్చిబాబులను పరామర్శిస్తున్న ఎంపీ రఘురామకృష్ణరాజు

కొవ్వూరు, మే 23 : కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రముఖులు, పార్టీలకతీతంగా దొమ్మేరు విచ్చేసి కృష్ణబాబు సోదరులు ది.ఆంధ్రసుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)ల తోపాటు రంగబాబు, కృష్ణబాబు కుమారుడు రవిబాబు, అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కృష్ణబాబు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఉండి కూటమి అభ్యర్థి రఘురామకృష్ణరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు కృష్ణబాబు కు నివాళులర్పించారు. అవంతి ఫీడ్స్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్, టీడీపీ నాయకులు అల్లూరి విక్రమాదిత్య, మాజీ ఎమ్మెల్యే కొవ్వూరు నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కొవ్వూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, కె.వి.కె.రంగారావు, టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదపాడు, మే 23 : రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్టు పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు. వట్లూరుకు చెందిన దేవరం భాస్కరరాజు(51) ఈనెల 22వ తేదీన ఓ మోటారుసైకిల్‌పై వట్లూరు నుంచి కాటూరు వెళుతుండగా కలపర్రు వద్ద ప్రమాదవశాత్తు రోడ్డుపై వెళుతున్న వ్యక్తిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో భాస్కరరాజుకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్ట్రాంగ్‌రూం వద్ద నిరంతరం నిఘా : జేసీ


సంతకం చేస్తున్న జేసీ

పెదపాడు, మే 23: సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూం వద్ద భద్రతను జాయింట్ కలెక్టర్, ఆర్వో బి.లావణ్యవేణి గురువారం పరిశీలించారు. ఈవీఏఎంల వద్ద అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. స్ట్రాంగ్‌రూం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని, ఇతరులను స్ట్రాంగ్‌రూం ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. అనంతరం ఈవీఎంల కంట్రోల్‌రూంను పరిశీలించారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి

పోలవరం, మే 23: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. పోలవరంలో గురువారం జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 144 సెక్షన్ అమలులో ఉందని, జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం, పబ్లిక్ మీటింగ్‌లు, నిర్వహించకూడదన్నారు. నాయకులు కార్యకర్తలు ఉద్దేశ్యపూర్వకంగా కవ్వింపు, రెచ్చగొట్టే చర్యలు, వ్యాఖ్యలు చేయకూడదని, అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

భీమడోలు, మే 23 : గ్రామాల్లో విగ్రహాల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ రవికుమార్ సూచించారు. పిఠాపురం తదితర ప్రాంతాల్లో ఇటీవల పలు విగ్రహాలు ధ్వంసమైన ఘటన నేపథ్యంలో పలు గ్రామాల్లో పోలీసు బందోబస్తు కల్పించారు. సంఘ వ్యతిరేక శక్తుల చేతుల్లో విగ్రహాలు ధ్వంసం కాకుండా కాపలా ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసుకోవాలని, పోలీసు సహకారం ఉంటుందని సీఐ సూచించారు. ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్ అందజేయాలని వినతి

ఏలూరు కలెక్టరేట్, మే 23: పోలింగ్ ముగిసి పదిరోజులు గడిచినా జిల్లాలో ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో డ్యూటీ సర్టిఫికెట్‌లు అందించలేదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అన్నారు. సర్టిఫికెట్ అందించినా కొన్ని నియోజకవర్గాల్లో 14 తేదీ కలపకుండా 12, 13 తేదీలతో పాటు రెండు ట్రైనింగ్ శిక్షణ తేదీలను డ్యూటీ సర్టిఫికెట్‌లో నమోదు చేశారని ఆయన తెలిపారు. దీనిపై గురువారం కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్‌ను కలిసి వివరించినట్లు తెలిపారు. మిగిలిన కొన్ని జిల్లాల్లో 12 నుంచి 14 వరకు ఎన్నికల విధులతో పాటు రెండు ట్రైనింగ్ క్లాసులను జోడించి, ఇచ్చిన సర్టిఫికెట్లను కలెక్టర్‌కు చూపించామన్నారు. 14వ తేదీతో కలిపి డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయులకు మిగిలిన ఉద్యోగులకు మాదిరిగా 30 సంపాదిత సెలవులు ఇవ్వరని, ఆరు రోజులే ఇస్తారని అందువల్ల వేసవి సెలవుల్లో ఎన్నికల విధులకు డ్యూటీ సర్టిఫికెట్లు సర్వీసు రిజిస్టర్‌లో నమోదవుతాయని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి జిల్లాలో ఒకే విధమైన డ్యూటీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారని ఆంజనేయులు తెలిపారు.

జిల్లాలో వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు


ప్రైవేట్ బస్సు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, మే 23: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ జూన్ 6 వరకూ అమలులో ఉంది. పోలీస్ శాఖ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలో అధికారులు రాత్రి వేళ ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిలో వాహన డ్రైవర్లకు ఫేస్ వాష్ నిర్వహిస్తున్నారు. ప్రధాన నగరాల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు. లాడ్జీలను కూడా తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడానికి పోలీస్ పికెట్లను, ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

ఏలూరు కల్చరల్, మే 23: శనివారపుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం సత్యనారాయణ స్వామి వ్రతాలు సామూహికంగా నిర్వహించారు. వేదపండితులు సత్యనారాయణస్వామి వ్రత మహాత్యాన్ని వివరించారు. పెద్దసంఖ్యలో దంపతులు స్వామివారి వ్రతంలో పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు లక్ష మల్లెల పూజ

ఏలూరు కార్పొరేషన్, మే 23 : వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా గురువారం పత్తేబాదలో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు లక్ష మల్లెల పూజ నిర్వహించారు. తొలుత అమ్మవారికి 108 కలశాలతో స్నాన మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, శ్రీచక్రార్చన నిర్వహించారు. అర్చకులు భక్తులతో సామూహిక పూజలు చేయించారు.

బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ పుష్పయాగం కార్యక్రమంలో భాగంగా గురువారం 21 రకాల పుష్పాలతో పూజలు చేశారు. లక్ష్మీగణపతి శివ పంచాక్షరి, నవగ్రహ, లలితా హోమాలు నిర్వహించారు. సహస్ర జ్యోతి లింగార్చన, దర్బార్ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పడమరవీధిలోని అళహ సింగరప్ప స్వామి ఆలయం వద్ద కల్యాణ మహోత్స వాల్లో భాగంగా గురువారం స్వామివారికి చక్రస్నానం, బలిహరణ, శాంతి హోమం, పూర్ణాహుతి, ధ్వజావరోహణ కార్యక్రమాన్ని అర్చకులు శ్రీనివాసుల విజయ గోపాలా చార్యులు నిర్వహించారు.

సత్రంపాడు అంబికాదేవి ఆలయంలో అమ్మవారికి 21 రకాల ద్రవ్యాలతో మహా పంచామృత అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంబికా కుటుంబసభ్యులు అమ్మవారికి విశేష పూజలు చేశారు.

ఆదివారపుపేట షిరిడీ సాయి ప్రేమ మందిర్‌లో బాబాను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. బాబా వారికి అభిషేకం, విశేష అలంకరణ చేశారు.

సాయినాథుని సన్నిధిలో అన్న సమారాధన

కామవరపుకోట, మే 23: స్థానిక రామాలయం ప్రాంగణంలో షిరిడీ సాయిబాబా మందిరం వద్ద గురువారం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. తొలుత బాబా వారికి అభిషేకం నిర్వహించి అనంతరం విశేష అలంకరణ జరిపారు. పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో వందనపు మురళీ, కాకి కిషోర్, వంకదార ఉదయ్, కొనకళ్ళ ప్రభు, బచ్చు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కైకరంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఉంగుటూరు, మే 23: వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం కైకరంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. కొడవటిగంటి వెంకటరాజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కోదండ రామాలయ వార్షికోత్సవం

పెదపాడు, మే 23: ఏపూరు తిమ్మనవీడు కోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అర్చకుడు నల్లపాటి హయగ్రీవా చార్యులు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, కళ్యాణోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

టి.నరసాపురం, మే 23: కొత్తగూడెంలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం గురువారం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు, సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

బళ్ళమ్మ ఆలయ వార్షికోత్సవం

టి.నరసాపురం, మే 23: అల్లం చల్లరాజుపాలెంలో బళ్ళమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

ఎక్కడి మురుగు అక్కడే..!




మాదేపల్లి రోడ్డులో మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త


ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో నిండిన డ్రెయిన్

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో మురుగునీరు పారే దారిలేక ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. మురుగుతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడివేసవిలోనే డ్రైన్‌ల పక్కన రోడ్లు మురుగుతో నిండిపోయాయి. వర్షాలు పడితే మురుగు సమస్య మరింత తీవ్రం కానుందని స్థానికులు వాపోతున్నారు. మాదేపల్లి రోడ్డులో బ్రహ్మంగారి గుడి వద్ద కల్వర్టు కింద 8అడుగులు వెడల్పు డ్రైన్ ఏర్పాటు చేశారు. అది సరిగ్గా పని చేయ్యకపోవడంతో కృష్ణకాల్వలో కలిసిపోతుంది. ఆ నీటినే మాదేపల్లి, జాలిపూడి, శ్రీపర్రు గ్రామాల్లో తాగునీరుగా వాడుతున్నారు. ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మురుగు కాల్వలు మెరుగుపరిచి మురుగుపారే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - ఏలూరు టూటౌన్

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ధర్నా చేస్తున్న డ్రైవర్లు

ఏలూరు టూటౌన్, మే 23: నగరపాలక సంస్థలో 60 మంది క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమయ్య డిమాండ్ చేశారు. వెహికల్ డిపో వద్ద గురువారం డ్రైవర్లు ధర్నా చేశారు. క్లాప్ ఆటోడ్రైవర్లుగా నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికి కనీస గుర్తింపుకార్డులు ఇవ్వలేదన్నారు. జీవో ప్రకారం జీతాలు చెల్లించడం లేదన్నారు. జీతాల కోసం ధర్నా చేయాల్సి రావడం దురదృష్టమన్నారు. డిసెంబర్‌లో సమ్మె కాలపు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27లోపు సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్రైవర్లు రాజు, గణేష్, సుగుణరావు, సతీష్, సుబ్బారావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య శాఖలో ట్రాక్టర్ డ్రైవర్లకు మూలవేతనం ప్రకారం జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. 9మంది కార్మికులకు 2022 ఏప్రిల్‌లో డ్రైవర్లుగా పదోన్నతి ఇచ్చారన్నారు. అప్పటి నుంచి డ్రైవర్‌కు ఇచ్చే మూలవేతనం ప్రకారం జీతాలు ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో డీ.అప్పారావు, డ్రైవర్లు ఉన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


గణితంపై అవగాహన కార్యక్రమం

లింగపాలెం, మే 23: పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని లైబ్రేరియన్ సీహెచ్ వెంకటరమణ అన్నారు. ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రామాల్లో వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నీతికథలు విజ్ఞానానికి సంబంధించిన విశేషాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్, గృహాలంకరణ ఐటమ్ చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు ఏ.వి నారాయణతో విద్యార్థులకు గణితశాస్త్రం మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు వెంకటరమణ, ఎస్ఏ లతీఫ్, ఉపాధ్యాయుడు నారాయణ, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


సూచనలు ఇస్తున్న సీడీపీవో బ్యూలా

కామవరపుకోట, మే 23: కిశోర బాలికలు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లిదండ్రులు పూర్తి బాధ్యత వహించాలని ఐసీడీఎస్ జంగారెడ్డిగూడెం ప్రాజెక్ట్ సీడీపీవో డి.బ్యూలా అన్నారు. జోగడిగూడెంలో గురువారం జరిగిన సమావేశంలో బ్యూలా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత అవసరమన్నారు. రక్తహీనత నివారణకు మందులు వాడాలని, వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కె.రాధ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, సూపర్‌వైజర్లు మంగాదేవి, వీరకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

లింగపాలెం, మే 23: వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయాలని ఆరోగ్య విస్తరణ అధికారి అబ్‌రార్ హుస్సేన్ అన్నారు. కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో రంగాపురం, ములగలంపాడు ఆరోగ్య ఉప కేంద్రాలను గురువారం పరిశీలించారు. వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తూ ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఏఎన్ఎంలు, ఆశాలు, ప్రతి ఇంటికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించాలని, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. అబ్రార్ హుస్సేన్, చంద్రశేఖర్, శ్రీవల్లీ, ప్రియాంక, జ్యోతి పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ


నాచుగుంటలో ఆరోగ్య సిబ్బంది పరిశీలన

ఉంగుటూరు, మే 23: దోమల నివారణ చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కాగుపాడు, నాచుగుంట గ్రామాలలో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. తాడేపల్లిగూడెం యూనిట్ మలేరియా ఆరోగ్య ఉప అధికారి వై.వీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నీటి నిల్వలను గుర్తించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది హెప్సీబా, ఆరోగ్య కార్యకర్తలు ధనలక్ష్మి, విజయ, ఆశాలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న అధికారులు

దొరసానిపాడులో మంచినీటి సరఫరా పునరుద్ధరణ

ద్వారకాతిరుమల, మే 23: దొరసానిపాడులో మంచినీటి సమస్యలపై 'గుక్కెడు నీరివ్వండి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దొరసానిపాడు ఎస్సీ కాలనీలో 50 కుటుంబాల వారికి నీటి సరఫరాలో అంతరాయాన్ని గుర్తించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఈవో పీఆర్‌డీ ఆదేశాలతో నీటి సరఫరా పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు.

పట్టిసీమ శివక్షేత్ర భూముల బహిరంగ వేలం

పోలవరం, మే 23: పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్ర ఆలయ భూముల బహిరంగ వేలం గురువారం పట్టిసీమ ఆలయ కార్యాలయంలో నిర్వహించారు. ఆలయ భూములను లీజు ప్రాతిపదికన రైతులకు ఇచ్చేందుకు వేలం నిర్వహించినట్లు ఆలయ కార్యదర్శి ఎస్.సంగమేశ్వరశర్మ తెలిపారు. పట్టిసీమ రైతులు, సిబ్బంది వెంకట్రాజు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి

కామవరపుకోట, మే 23: మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ సమావేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగింది. గ్రామాల్లో మంచినీటి కొరత ఏర్పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అవాంతరాలు కలగకుండా సరఫరా చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభించేనాటికే పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూ, సాక్స్ బెల్ట్‌లు అందజేయాలన్నారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా రైతులకు సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో జంగం స్వర్ణభారతి, జడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్ కరిపోతు అనూష, మేడూరి రంగబాబు, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీరు, మజ్జిగ పంపిణీ అభినందనీయం


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఈ సాల్మన్‌రాజు

ఏలూరు రూరల్, మే 23: వేసవిలో తాగునీరు, మజ్జిగ అందించడం అభినందనీయమని ఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు అన్నారు. ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామి గుడి వద్ద ఉద్యోగులు ఏర్పాటు చేసిన కేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. విజయ డెయిరీ ద్వారా ప్రతిరోజూ 150 లీటర్ల మజ్జిగ కొనుగోలు చేసి వెయ్యి మందికి అందిస్తున్నారు. డీపీఆర్వో రామచంద్రరావు, విద్యుత్‌శాఖ ఈఈ జేవీవీ నటరాజన్, ఏఈఈ ప్రసన్నవల్లి, ఏజీ సత్యనారాయణ, ఎస్.బలుసుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చింతలపూడి, మే 23: పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చింతలపూడిలో పదో తరగతికి రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 243మంది పరీక్షలకు హాజరవుతున్నారు. బాలికల హైస్కూల్, సుబ్బరాజు హైస్కూల్లో ఈ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని, శుక్రవారం ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని ఎంఈవో పి.రామారావు తెలిపారు. ఇంటర్ పరీక్షలు కూడా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ స్టైలాబ్ తెలిపారు. ఈనెల 31తో ఇంటర్ పరీక్షలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

శ్రీనివాసరావుకు విశ్వకర్మ లెజండరి అవార్డు

కొయ్యలగూడెం, మే 23: విశ్వకర్మ లెజండరి జాతీయ అవార్డు దాసరోజు శ్రీనివాసరావుకు దక్కింది. గురువారం విశ్వబ్రహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. విశ్వబ్రహ్మణ సంక్షేమం కోసం కృషి చేసిన ఆయనకు అవార్డు దక్కటం హర్షణీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కొయ్యలగూడెం సంఘం అధ్యక్షులు రాంబాబు, కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, నాగు, తదితరులు ఉన్నారు.

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల

పోలవరం, మే 23: మండలంలో ఈ నెల 24 నుంచి 26 వరకూ ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఏఈ పి.రాధాకృష్ణ గురువారం తెలిపారు. పోలవరం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 400 కెవి లైన్ గుడ్డిగూడెం 400 కెవి సబ్ స్టేషన్ వరకూ కొత్త లైను ఏర్పాటు పనులు జరుగుతున్న నేపథ్యంలో దేవరగొంది సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

● పెదపాడు: పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్ర, శనివారాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఏఈ వై.రాంబాబు తెలిపారు. ఖాజీగూడెం, గుడిపాడు, వడ్డిగూడెం, గోగుంట, వసంతవాడ, తోటగూడెం, పునుకొల్లు పరిసరప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేయబడునని, ప్రజల సహకరించాలని కోరారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల పాట్లు


మండుటెండలో నిలిచిన ఆర్టీసీ బస్సు

పోలవరం, మే 23: రాజమహేంద్రవరం నుంచి పోలవరం వెళ్లే ఆర్టీసీ బస్సు గురువారం మధ్యాహ్నం మండుటెండలో నిలిచి పోయింది. పట్టిసీమ కన్నాపురం అడ్డరోడ్డు మధ్య సాంకేతిక లోపంతో ఆగిపోయింది. నాలుగు కిలోమీటర్ల గమ్యం చేరడానికి మండుతున్న ఎండలో ప్రత్యామ్నాయం లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. బస్సు చెత్త డంపింగ్ వద్ద నిలిచిపోవడంతో దుర్గంధం భరించలేక కొంతమంది ప్రయాణికులు, కండక్టరు బస్సును కొంత దూరం నెట్టుకు వచ్చారు. బస్సు ఎయిర్ లాక్‌తో ఆగిపోయిందని డ్రైవర్ తెలిపారు. బస్సు కదలక పోవడంతో కొందరు కాలినడకన వెళ్లారు.

బాలికను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు టూటౌన్, మే 23: మండవల్లి మండలం పుల్లపర్రు గ్రామానికి చెందిన బాలికపై దౌర్జన్యం చేసి వీడియో చిత్రీకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, శ్యామలరాణి డిమాండ్ చేశారు. ప్రతీరోజు మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చింతపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఆకతాయిల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆత్మహత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనుల కల్పనపై అసత్య ఆరోపణలు

ఏలూరు రూరల్, మే 23: కోమటిలంకలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడం లేదని అసత్య ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ తెనాలి యోహాను అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడేళ్లుగా గ్రామంలో సుమారు 400 మందికి పైగా ఉపాధి కూలీలు వివిధ పనులు చేస్తున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తి కొందరిపై తప్పుడు కేసులతో వేధిస్తున్నాడని, ఉపాధి కూలీల్లో కొందర్ని పనులకు వెళ్ళకుండా బెదిరిస్తున్నాడని సర్పంచ్ ఆరోపించారు. అతని ఆగడాలకు అడ్డుపడుతున్నామనే తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నాడని మండిపడ్డారు. అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 23: దేవరపల్లి మండలం లక్ష్మీపురంలో విద్యుత్ అక్రమంగా వినియోగంపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వి.రవికుమార్ కేసు నమోదు చేశారు. సిబ్బందితో గురువారం పోతునూరి వెంకట సురేష్ ఇంటిని తనిఖీ చేశారు. రూ.45,235 అపరాధ రుసుము విధించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టుకున్న పోలీసులు

కొయ్యలగూడెం, మే 23: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మండలంలోని రాజవరం ఎర్ర కాల్వ నుంచి గురువారం ఇసుక తరలిస్తుండటంతో సమాచారం అందడంతో ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


భీమడోలు జంక్షన్‌లో గోతులు పూడుస్తున్న ఎక్సకవేటర్

రహదారికి జనసేన ఆధ్వర్యంలో మరమ్మతులు

భీమడోలు, మే 23: భీమడోలు జంక్షన్‌లోని గోతులమయమైన ద్వారకా తిరుమల రహదారిని జనసేన నాయకులు మరమ్మతులు చేపట్టారు. పోలసానపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకులు సొంత ఖర్చుతో ఆ గోతులను పూడ్చివేశారు. పాలకులు పట్టించుకోనప్పటికీ జనసేన నాయకులు చేసిన సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.


పి.అంకంపాలెం వద్ద రోడ్డు తవ్వుతున్న యంత్రం

రహదారి తవ్వేస్తున్నారు..

రహదారులు అధ్వానంగా ఉన్నా పట్టించుకోని అధికారులు బాగున్న రోడ్లు మాత్రం తవ్వేస్తున్నారు. ఇటీవల తాటియాకులగూడెం నుంచి జీలుగుమిల్లి నాల్గు రోడ్ల కూడలి మీదుగా బుట్టాయగూడెం, పోలవరం పట్టిసీమ వరకు జాతీయ రహదారి నిర్మాణం చేపట్టేందుకు కొలతలు వేశారు. ప్రస్తుతం రోడ్డు మరమ్మతు పనుల పేరుతో రహదారి పెకలించి పెచ్చులు చేశారు. తాటియాకులగూడెం, కామయ్యపాలెం వాగు, పి.అంకంపాలెం శ్రీరామాలయం వద్ద చక్కని రోడ్డును తవ్వేస్తున్నారని వాహనచోదకులు వాపోతున్నారు. - జీలుగుమిల్లి

అడవి నరికేస్తున్నారు!

మారుజాతి కలప అక్రమ రవాణా


రౌతుగూడెం వైపు అడవి నుంచి ములగలంపల్లి తరలిస్తున్న కలప (పుల్ల)

జీలుగుమిల్లి, మే 23: ములగలంపల్లి బేడదనూరు బీట్ పరిధిలో అడవి నరికేస్తున్నారు. మారుజాతి కలప అక్రమంగా ఎడ్ల బండ్లపై తరలిపోతోంది. అడవి నుంచి నేరుగా రహదారిపై కలప తరలించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇటీవల నిత్యం పొగాకు బ్యారన్‌ల వద్దకు క్యూరింగ్(ఉడికింపు) కోసం కొందరు అడవిలో మారజాతి మొక్కలు నరికి అమ్ముతున్నారు. అటవీశాఖ అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. అటవీ అధికారుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. వారి అనుమతి లేకుండా తరలిస్తే కేసులు నమోదు తప్పదని, కొందరు రైతులు అటవీ అధికారులకు మాముళ్ల ముట్టజెప్పడంతో మారుజాతి కలప తరలిపోతోందని స్థానికులు చెబుతున్నారు. గతంలో రాత్రి వేళ ట్రాక్టర్లపై అడవి పుల్ల తరలించేవారు. అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేయడంతో కొంత కట్టడి అయింది. ప్రస్తుతం రూటు మార్చి ఎడ్ల బండ్లపై కొంచెం కొంచెం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ సంరక్షణకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడం, వర్షాకాలంలో మొక్కలు నాటడం నాణానికి ఒక వైపు అని, మరోవైపు నాటిన మొక్కలు అడవిలో వృక్షాలుగా మారకముందే నరికించడం మరో వైపు అన్నట్లు ఉందని పలువురు విమర్శిస్తున్నారు.


ములగలంపల్లిలో పొగాకు క్యూరింగ్ కోసం తరలించిన కలప (పుల్ల)

కొల్లేరు బీటలు

ఎండిన అతిపెద్ద మంచినీటి సరస్సు



- మనుగడ కోల్పోయిన మత్స్య సంపద
- గుక్కెడు నీళ్ల కోసం తిప్పలు అనేకం
- ఆటపాక.. పక్షుల కేంద్రానికే పరిమితం

ఆటపాక పక్షుల కేంద్రంలో వలస పక్షులు

కొల్లేరు కళ తప్పి ఎడారిని తలపిస్తోంది. పరవళ్లు తొక్కే మంచినీటి సరస్సు వెలవెలబోతుంది. పచ్చని భూములు బీటలు వారాయి. పక్షుల కిలకిలరావాలు ప్రకృతి సోయగాలు కనిపించడంలేదు. సరస్సు అందాలు అవిరయ్యాయి. ఆసియా ఖండంలోనే అతిపెద్ద సరస్సుగా పేరొందిన కొల్లేరులో నేడు మనుషులకే కాదు పక్షులకూ కూడా గుక్కెడు నీరు దొరకని పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడక్కడ ఉన్న నీటి కుంటల్లో పక్షులు సేద తీరుతున్నాయి. కొల్లేరును చూస్తే ఇది మంచినీటి సరస్సేనా అని సందేహం కలుగుతుంది. ఎప్పుడూ నీటితో కళకళలాడే కొల్లేరు సరస్సు నేల బీటలు వారిన దుస్థితి నెలకొంది.

- కైకలూరు, మే 23 :

ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండడంతో సరస్సులో నీరు లేదు. 77,138 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొల్లేరు సరస్సుకు సుమారు 60 మీడియం, మైనర్ డ్రెయిన్లు, కాలువల నుంచి పది టీఎంసీల నీరు కొల్లేరులోకి ప్రతీ ఏడాది చేరుతుందని నిపుణులు అంచనా వేసేవారు. కళకళలాడుతున్న కొల్లేరులోని నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రమార్గం ద్వారా ప్రవహించి సరస్సు అంతర్భాగంలో ఐదు టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని అంచనా. నేడు అందుకు భిన్నంగా సరస్సు ఎడారిని



ఒడ్డుకు చేరిన మత్స్యకారుల దోనెలు

తలపిస్తోంది. వాతావరణ సమతుల్యత దెబ్బతిని సరస్సు కళ కోల్పోయింది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేవి. రానురాను భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. పది అడుగులు లోతు వెళితే ఉప్పునీరు వస్తుంది.

సుదీర్ఘ ప్రాంతాలకు వలసలు

నీటి కళతో కళకళలాడుతున్న సమయంలో కొల్లేరు ప్రజలు సంప్రదాయ చేపలవేట చేసుకుని జీవనం సాగించేవారు. చేపల వేటపై ఆధారపడే వేలాది కుటుంబాలు జీవించేయి. నేడు నీరు లేక చేసేదిలేక ప్రజలు సుదీర్ఘ ప్రాంతాలకు వలసలు పోతున్నారు. సుమారు 50 ఏళ్ల కాలంగా ఇలాంటి దుస్థితి కానరాలేదు. గత మూడు, నాలుగేళ్ల కాలంలో కొద్దిమేర నీటి నిల్వలు ఉండేవి. ఈ పరిస్థితిని ఎన్నడూ చూడలేదని కొల్లేటిలోని ప్రజలు వాపోతున్నారు. ఉప్పుటేరు నుంచి సముద్రపు పోటు కలిగి కైకలూరు, ఆకివీడు మండలాల్లోని కొల్లేరు సరస్సులోకి ఉప్పుటేరు ప్రవహిస్తుంది. ఈ నీటి వల్ల మత్స్యసంపదకు నష్టం వాటిల్లితుంది. ఈ నీరు పశువులు తాగేందుకు కూడా పనికిరావడం లేదు.

తిరుగు ముఖం పడుతున్న పక్షులు

కొల్లేరులో సామర్థ్యానికి తగిన నీటి నిల్వలు లేకపోవడంతో సుదీర్ఘ ప్రాంతం నుంచి వచ్చే వలసపక్షులు కూడా తిరిగిముఖం పట్టాయి. కొల్లేరులో లభించే 80 రకాల మత్స్యసంపద మనుగడ ప్రశ్నార్థకమైంది. కైకలూరు నుంచి ఏలూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న కొల్లేరు సరస్సులో చిన్నచిన్న నీటికుంటలు కన్పించిన దాఖలులు లేవు. ఎంత వర్షాభావం తక్కువగా ఉన్న చిన్న, పెద్ద ఎడ్లగాడిలో ఎప్పుడూ నీరు ప్రవహిస్తూనే ఉండేది. అలాంటిది ఈ ఏడాది గాడిల్లో నీరు లేక నేలబీటలు వారింది. కొల్లేరు అభయారణ్యప్రాంతంలో అక్కడక్కడ పచ్చిక బైల్లు కూడా ఎండిపోవడంతో పశువులకు మేత దొరకడం లేదు. పలు దేశాల నుంచి వచ్చే వలస పక్షులకు ఆటపాకలోని 310 ఎకరాల్లో ఏర్పాటుచేసిన పక్షుల కేంద్రంలో తప్ప ఎక్కడా నీరు దొరికే పరస్థితి కనిపించడం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పక్షులు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిపోతున్నాయి.

ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మించాలి..

గతంలో కొల్లేరులో సరస్సు ఎగువ భాగాన పంటలు పుష్కలంగా పండేవి. ఏ గ్రామంలో చూసినా వ్యవసాయం ఉండడంతో రెండు పంటలకు నీరు అందడంతో ఆ నీటిని కాలువలు, డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోనికి వదిలే వారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా చేపలచెరువులే కనిపించడంతో ఉన్న నీటిని కొందరు సైక్లింగ్ చేసుకోవడమే తప్ప దిగువ కొల్లేరులోకి నీరు వదిలే పరిస్థితులు లేవు. ఇప్పటికైనా ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మించేలా ప్రకృతి ప్రేమికులు, నిపుణులు కోరుకుంటున్నారు.

రెగ్యులేటర్ నిర్మించాలి



పేరుకే కొల్లేరు మంచినీటి సరస్సు. పుస్తకాల్లోనూ, రికార్డుల్లో మాత్రమే ఇది వర్తిస్తుంది. తాగేందుకు చుక్క నీరు లేదు. ఎగువ ప్రాంతాల్లోని రైతులు వారి అవసరాలకు అడ్డుకట్లు వేసి దిగువకు నీరు పారుదల జరగకుండా ఆపడంతో డిసెంబరు నెలకే సరస్సు ఎడారిలా మారిపోతుంది. నీరు నిల్వ చేసుకునేందుకు రెగ్యులేటర్ నిర్మాణం చేసేలా ప్రభుత్వాలు కృషి చేయాలి.

- ఘంటసాల వెంకటేశ్వరరావు కొవ్వాడలంక

కొల్లేరులో నీరు తాగేవాళ్లం



వర్షాకాలంలో కొల్లేరులో కొద్దిమేర నీరు ఉన్నప్పటికి అనతి కాలంలోనే ఎండిపోవడంతో తాగేందుకు, పశువులకు సైతం నీరు, మేత దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతీ ఏడాది ఇదే పరిస్థితి కొనసాగుతుంది. మా చిన్న తనంలో కొల్లేరులోని నీటినే తాగి జీవించేవాళ్లం. ప్రస్తుతం కైకలూరు, ఆటపాక ప్రాంతాల నుంచి నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- పోతురాజు మహేష్, కోమటిలంక

నీటి నిల్వలు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం

కొల్లేరు సరస్సులోకి నీరు వచ్చే సుమారు 60 మేజర్, మైనర్ డ్రెయిన్లు పూడుకుపోవడంతో నీరు ఎగువ నుంచి సరస్సులోకి చేరడం లేదు. వీటి ఆధునీకీకరణ కోసం అటవీ శాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధునికీకరణ పనులు చేపట్టి నీరు నిల్వలు పెంచేందుకు కృషి చేస్తాం.

- కేవీ నాగలింగాచార్యులు, అటవీశాఖ రేంజర్, కైకలూరు

జూన్ 19 వరకు ఎన్నికల కోడ్

మండవల్లి, మే 23: మండలంలో జూన్ 19వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా సెక్షన్ 144, అలాగే సెక్షన్ 30 కూడా అమల్లో ఉంటుందని నిబంధనలు పాటించాలని మండవల్లి పోలీస్ ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు. ఎక్కడా కూడా ముందస్తు అనుమతి లేనిదే సభలు కానీ, సమావేశాలు కాని, ధర్నాలు కానీ నలుగురుకి మించి గూమి గూడటం కానీ చేయకూడదు ఎలాంటి పొలిటికల్ వదంతులు ఫార్వర్డ్ చేయకూడదని హెచ్చరించారు. అలాగే బాణసంచా అమ్మడం, కాల్చడం, డీజే బాక్సులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడరాదని, నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ రామచంద్రరావ హెచ్చరించారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ముదినేపల్లి, మే 23 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ముదినేపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూలు, సహాయ మాతా ఇంగ్లీష్ మీడియం హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో సుమారు 400 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. హైస్కూలు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆ హైస్కూలు ఫిజికల్ సైన్స్ టీచర్ రామ్మోహన్, సహాయ మాతా హైస్కూలు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా మండవల్లి హైస్కూలు టీచర్ జ్యోత్స్న నియమితుయ్యారని ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు.

ఆగిరిపల్లి, మే 23: పదో తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలకు ఆగిరిపల్లిలోని జడ్పీహెచ్ స్కూల్ 211 మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఎంఈవో కలపాల సర్వేశ్వరరావు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ముదినేపల్లి, మే 23 : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఈ సప్లమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షా కేంద్రంలో జూనియర్ కళాశాలతోపాటు ప్రైవేట్ కళాశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు జూనియర్ కళాశాలలో నాలుగు రూములను కేటాయించామని, నలుగురు ఇన్విజిలేటర్లను నియమించినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి తెలిపారు.

కిషోర బాలికలకు అవగాహన

చాట్రాయి, మే 23: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని బూరుగ్గూడెంలో గురువారం కిషోర బాలికలకు పర్సనల్ హైజీన్ గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నూజివీడు ప్రాజెక్టు చైల్డ్ డవలప్‌మెంట్ అధికారిణి డి.నాగేశ్వరి మాట్లాడుతూ కిషోర బాలికలకు పోషకాహార లోపం రాకుండా తల్లి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎదిగే వయస్సులో సరైనా ఆహారం తీసుకోకపోతే పెళ్లి అయ్యి పిల్లల తల్లి అయ్యాక అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. పర్సనల్ హైజీన్, బాల్య వివాహాల వలన అనర్థాలు గురించి వివరించారు. సూపర్‌వైజర్ రమాదేవి, ఏఎన్ఎం మధురవాణి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న విద్యాసాగర్

నూజివీడు టౌన్, మే 23 : పచ్చిరొట్ట విత్తనాల ద్వారా భూమిని సారవంతం చేసి మెరుగైన దిగుబడులను పొంద వచ్చని, నూజివీడు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ అన్నారు. తుక్కులూరు ఆర్బీకేలో రైతు లకు గురువారం పచ్చిరొట్ట విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తొలకరి వర్షాలు కురిసిన సందర్భంలో జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు చల్లి పూతకు వచ్చిన సమయంలో భూమిలో కలియదున్నటం ద్వారా భూసారాన్ని పెంచవచ్చన్నారు. తద్వారా రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించడంతో పాటు మెరుగైన దిగుబడులను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎ.చాముండేశ్వరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, మే 23: ఆగిరిపల్లి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పలగాని చెన్నారావు తెలిపారు. జీలుగు విత్తనాలు 100 క్వింటాళ్ళు, పిల్లి పెసర విత్తనాలు 50 క్వింటాళ్ల, జనుము విత్తనాలు, 30 క్వింటాళ్ల ఆర్బీకేలలో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావలసిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డులతో రైతుభరోసా కేంద్రాల్లో బయోమెట్రిక్ విధానంలో 50 శాతం సబ్సిడీలో పొందగలరని తెలిపారు. జీలుగు విత్తనం రూ.88, పిల్లిపెసర రూ.134 జనుము రూ.88 ఈ ధరలలో 10 కిలోలు ప్యాకింగ్‌లో అందుబాటులో ఉన్నాయని వీటికి 50 శాతం సబ్సిడీ లభిస్తుందని ఒక్కొక్క రైతుకు ఐదు ఎకరాల వరకు అందించగలమని తెలిపారు.

ఆర్టీసీ పెట్రోల్ బంకు ప్రారంభం

నూజివీడు, మే 23: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు గురువారం ప్రారంభించారు. నూజివీడు ఆర్టీసీ డీఎం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకును లాంఛనంగా ప్రారంభించారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు, వ్యాపార లావాదేవీలలో భాగంగా ఆర్టీసీ కార్గో సర్వీసుతో పాటు పెట్రోల్ బంకుల నిర్వహణ దిశగా అడుగులు వేస్తోందని, నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతో బంకు ఏర్పాటు చేశామన్నారు.

నీతి కథల బోధన

ముదినేపల్లి, మే 23 : వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ముదినేపల్లి గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించి, నీతి కథలను బోధించారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు పసు మర్తి సత్యనారాయణ విద్యార్థుల కు నీతి కథలను చెప్పగా, డిగ్రీ విద్యార్థిని పరసా అంకిత ప్రైమరీ పాఠశాలల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో క్యారమ్స్, చెస్ ఆటలను నేర్పించారు.

కలిదిండి, మే 23 : కలిదిండి గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిం చారు. విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రంథా లయాధికారి జె.రమేష్ బాబు బహుమతులు ప్రదానం చేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో నైపు ణ్యతను పెంపొందిం చటానికి వేసవి విజ్ఞాన శిబిరం దోహద పడుతుందన్నారు.

జ్వరం తగ్గినా... వంటి నొప్పులతో అవస్థలు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- తాగునీటిలో బ్యాక్టీరియా : అధికారులు
- చిన్నంపేటలో వైద్య శిబిరం ఏర్పాటు





చిన్నంపేటలో వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి, గ్రామంలో చేస్తున్న పారిశుధ్య పనులు

చాట్రాయి, మే 23: చిన్నంపేటలో రెండు నెలల నుంచి జ్వరం బారిన పడినవారికి, వంటి నొప్పులు వాపు తగ్గకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ గత 17వ తేదీ నుంచి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందజేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ నరేంద్ర గురువారం గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వైద్య శిబిరం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి, వైద్యాధికారి దుర్గాప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జ్వరాలు అదుపులో ఉన్నాయని ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. ప్రజలు తాగేనీటిలో బ్యాక్టీరియా ఉండడం వలన జ్వరాలు వంటి నొప్పులు వస్తున్నట్లు గుర్తించి రెండు బోరు చేతి పంపులు, ఒక మినరల్ వాటర్ ప్లాంటు మూయించి వేశామన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి 42 మంది బాధితుల గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తున్నామని వీరిలో ఎక్కువ మందికి నొప్పులు తగ్గి రోజువారీ పనులకు వెళుతున్నారన్నారు. 95 మంది గ్రామస్తుల రక్త నమూనాలు సేకరించి లాబ్‌కు పంపగా నార్మల్‌గా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహారాన్ని మాత్రమే తినాలని, దోమ తెరలు వాడాలని, జ్వరం లక్షణాలు కన్పిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ పరసా ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నిషాక్ అలీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ధైర్యం చెప్పాలి



చిన్నంపేటలో ప్రతి ఇంట్లో ఒకరిద్దరు ఒళ్లు నొప్పులతో బాధ పడుతున్నారు. సత్తుపల్లి, విజయవాడ పెద్ద ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నా కారణం చెప్పటం లేదు. అధికారులు ప్రజలకు భరోసా కల్పించాలి

- దూబగుంట్ల కృష్ణ, చిన్నంపేట, చాట్రాయి మండలం

గ్రామాల్లో పోలీసుల కార్డన్ సెర్చ్



బొమ్మినంపాడులో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ

ముదినేపల్లి, మే 23 : బొమ్మినంపాడు, జానకిగూడెం గ్రామాల్లో ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు గురువారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగనున్న నేపథ్యంలో కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్ కుమార్ పోలీసు సిబ్బంది పలు వాహనాలను తనిఖీ చేసి వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఇళ్ల వద్ద ఉన్న వాహనాలను తనిఖీ చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా అందరూ సంయమనంతో వ్యవహరించి శాంతిభద్రతలకు సహకరించాలని సీఐ కృష్ణకుమార్ కోరారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ కొనసాగుతుందని చెప్పారు.

అడుగంటిన తాగునీటి చెరువు



కోరుకొల్లులో అడుగంటిన తాగునీటి చెరువు

కలిదిండి, మే 23 : కోరుకొల్లు మేజర్ పంచాయతీ చెరువు అడుగంటడంతో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. చెరువులో నీరు రంగు మారి దుర్వాసన రావడంతో తాగలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. రోజు విడిచి రోజు కుళాయిల నీరు వదులుతున్నారు. నీరు రంగు మారడంతో తాగలేక ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల్లో తాగునీరు కొనుగోలు చేసుకొని తాగుతున్నారు. పేదలు వృద్ధులు ఊట బావుల్లో కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నారు. చెరువు నీరు బురదగా ఉండడంతో వాడకానికి కూడా పనికిరావడం లేదని ప్రజలు అంటున్నారు. చెరువులో నీరు ఇంకా వారం రోజులు మాత్రమే వస్తాయని, ఏప్రిల్‌లో తాగునీటి వంతు సక్రమంగా ఇవ్వకపోవడం, మంచి నీటి చెరువు పూర్తిస్థాయిలో నింపకపోవడంతో నెల రోజులకే చెరువు నీరు అడుగంటి తాగునీటి ఎద్దడి ఏర్పడిందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జల వనరుల శాఖ అధికారులు త్వరితగతిన కాలువలకు తాగునీరు విడుదల చేయకపోతే గ్రామాల్లో మరింత తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి త్వరగా కాలువలకు తాగు నీటి విడుదల చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులకు విన్నవించాం



తాగునీటి చెరువు నింపడానికి నీటి వంతు ఇవ్వాలని, 15 రోజుల క్రితమే ఇరిగేషన్ అధికారులకు తెలిపాం. ఏప్రిల్‌లో పూర్తిస్థాయిలో తాగునీటి వంతు ఇవ్వకపోవడంతో చెరువును పూర్తిగా నింపలేక పోయాం.

- బట్టు లీలా కనకదుర్గ, సర్పంచ్

మురుగు నీటితో రోడ్డు అధ్వానం



ఆచవరం–శ్యామలాంబపురం సిమెంట్ రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కైకలూరు, మే 23: నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే రహదారి మురుగు నీటితో అధ్వానంగా మారండంతో పాదచారులు, వాహనచోదకులు జారి పడుతున్నారు. డ్రెయిన్ పూడుకుపోయి మురుగు నీరు పారక రోడ్డు పైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కైకలూరు మండలం ఆచవరం గ్రామం నుంచి శ్యామలాం బపురం వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. నివాసల వద్ద డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో ఆ నీరు రోడ్డు పై చేరుతుంది. నిత్యం ఆచవరం ప్రజలు శ్యామలాంబపురం నుంచి మంచినీటి కోసం కాలినడకన, సైకిళ్లు, బైక్‌లపైన ఈ రహదారిలోనే ప్రయణించి తాగు నీటిని తెచ్చుకుంటూ ఉంటారు. ఈ దుస్థితిపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్‌కు మరమ్మతులు చేయించి రహదారిపైకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పారిశుధ్య మెరుగుదలకు చర్యలు



కలిదిండి, మే 23 : పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నా మని ఈవోపీఆర్డీ వై.రాజారావు తెలిపారు. కోరుకొల్లులో గురువారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. డ్రెయినేజీల్లో పూడిక తీయించారు. రహదారులపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

క్రైం వార్తలు

రియాక్టర్ పేలుడు ఘటనలో కేఆర్ పాలెం యువకుడు మృతి



చాట్రాయి, మే 23: హైదారాబాద్ పరిధిలో చౌటుప్పల్ ఎస్వీ ఫార్మా ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ లో బుధవారం రాత్రి జరిగిన రియాక్టర్ పేలుడులో చాట్రాయి మండలం కృష్ణారావుపాలెంకు చెందిన కట్టిబోయన నాగరాజు(35) మృతి చెందాడు. నాగరాజు నాలుగేళ్ల నుంచి ఈ ల్యాబ్‌లో షిఫ్ట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. చిన్న రైతు కుటుంబంలో పుట్టిన నాగరాజు కష్టపడి చదువుకొని ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులకు అండగా నిలిచాడు. రియాక్టర్ పేలుడు రూపంలో నాగరాజును మృత్యువు కబళించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నాగరాజు మృతితో కృష్ణారావుపాలెంలో విషాదం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం నాగరాజు భౌతిక కాయాన్ని గురువారం రాత్రి కృష్ణారావుపాలెం తీసుకువచ్చారు. మృతుడికి భార్యా కుమారుడు కుమార్తె ఉన్నారు.

కల్యాణం కమనీయం

లక్ష్మీనరసింహస్వామి..



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చాట్రాయి, మే 23: చనుబండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.

అల్లూరులో...

ముదినేపల్లి, మే 23 : అల్లూరులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. రుద్రాభిషేకం, బలిహరణ అనంతరం స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు, శీలం వెంకటేశ్వరరావు, చుక్కల చంద్రరావు తదితరులు స్వామి కల్యాణాన్ని జరిపించారు. పెదతుమ్మడికి చెందిన అర్చకుడు సోమరాజుపల్లి ఈశ్వరరావు శర్మ, ఆలయ అర్చకుడు అయిలూరి సుబ్బరాయ శర్మ కల్యాణాన్ని, పూజలను నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

ఎన్‌డీఏ కూటమిదే విజయం



ఏడుకొండలును పరామర్శిస్తున్న పెడన టీడీపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్

ముదినేపల్లి, మే 23 : రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టడం ఖాయమని పెడన అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని తిరిగి వస్తుండగా, రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన తెలుగుదేశం పార్టీ జిల్లా టీసీ సెల్ కార్యదర్శి పరసా ఏడుకొండలును గురువారం ముదినేపల్లి మండలం విశ్వనాద్రిపాలెంలో ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనతో విసుగెత్తిపోయిన ప్రజలు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నట్లు పోలింగ్ సరళిని బట్టి స్పష్టమవుతోందన్నారు. పెడన నియోజకవర్గం నుంచి తాను మంచి మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు. టీడీపీ నాయకులు యార్లగడ్డ గంగయ్య, మరిపి శివ, పరసా పెద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ 'కొనకళ్ల'కు పరామర్శ



మాజీ ఎంపీ నారాయణను పరామర్శిస్తున్న కూటమి నాయకులు

కైకలూరు, మే 23: మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను కైకలూరు కూటమి నాయకులు పరామర్శించారు. మచిలీపట్నంలోని ఆయన ఇంటి వద్ద గురువారం ఆయన్ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు కమ్మిలి విఠలరావు, బీకేఎం నాని, తమ్మినేని వరప్రసాద్, పూల రామచంద్రరావు, బోయిన రామకృష్ణ, తలారి రామారావు, దావు నాగరాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సమాజ శాంతి అందరి ధ్యేయం



మాత ఉత్సవాల్లో పాల్గొన్న ఫాదర్లు

ముదినేపల్లి, మే 23 : సమాజ శ్రేయస్సు, శాంతి స్థాపన ప్రతి వ్యక్తి ధ్యేయం కావాలని ఆర్‌సీఎం సంఘ మంగళగిరి డీవైన్ మెర్సీ ధ్యానాశ్రమ ఫాదర్ రెవరెండ్ థామస్ అన్నారు. ముదినేపల్లిలో ఆర్‌సీఎం సంఘం స్థాపించి 55 ఏళ్లు నిండిన సందర్భంగా గురువారం సహాయ మాత మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న థామస్ మాట్లాడుతూ సామరస్యంతో వ్యవహరించటం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెంటాల విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌సీఎం సంఘ ఫాదర్లు అమల్, ఫోర్ జిన్, చందు, బ్రదర్ బాలు, దివ్య, మరియ కుమార్, మాతంగి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి



మండవల్లిలో బుద్ధుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

మండవల్లి, మే 23: గౌతమ బుద్ధుడు నేర్పిన శాంతి, సహనం, అహింస మార్గాలు ప్రపంచానికే ఆదర్శమని ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కె.శాంతరాజు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. బౌద్ధ మత స్థాపకులు బుద్ధుడి జన్మదినం సందర్భంగా బుద్ధ జయంతి కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి వారి ఆధ్వర్యంలో గురువారం గ్రామంలోని బాబాసాహేబ్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి ఫోటో వద్ద పూలు ఉంచి, కొవ్వొత్తులను వెలిగించి, ఆయన అడుగుజాడల్లో నడవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి రవివరప్రసాద్, చాబత్తిన విజయ్, జి.రమేష్, గాంధీ, సూర్యారావు, గాజులపల్లి వెంకటేశ్వరరావు, ముక్కు చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో...



కలిదిండి, మే 23 : కోరుకొల్లులో ఉన్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణం అర్చకులు కాశీవిశ్వేశ్వరరావు స్వర్ణ ఉమాశంకర్, స్వర్ణ విజయకుమార్, సుబ్రహ్మణ్యం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్నంశెట్టి శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు



హోమ పూజలు చేస్తున్న భక్తులు

కైకలూరు, మే 23: మీసాల వేంకటేశరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. చక్రస్నానం, ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవ, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హోమ పూజలు నిర్వ హించారు. ఆలయ అధికారి వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.